నిమ్జ్ ప్రాజెక్టులో పరిశ్రమల ఏర్పాటు పనులు వేగవంతం చేయాలి

అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, మార్చి 27 : జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నిమ్జ్ ప్రాజెక్టులో పరిశ్రమల ఏర్పాటు పనులను వేగవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 2013 సంవత్సరంలో జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల పరిధిలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన నిమ్జ్ ప్రాజెక్టులో పరిశ్రమల పనులను వేగవంతంగా కొనసాగడం లేదన్నారు. నిమ్జ్ ప్రాజెక్టులో పరిశ్రమల ఏర్పాటు కోసం సేకరించిన ఆయా మండలాల పరిధిలోని భూముల్లో వేమ్ టెక్నాలజీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు పరిశ్రమ ప్రతినిధులు పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు అప్పట్లో 511 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమ కోసం యాజమాన్యం తొలిదశలో వెయ్యి కోట్ల పెట్టుబడులతో సుమారు వెయ్యి మందికిపైగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో 2022 జూన్ 22న బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అప్పటి రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమ శాఖ మంత్రి కేటీఆర్ భూమి పూజలు చేశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పరిశ్రమకు సంబంధించిన ఎలాంటి పనులు జరగడం లేదన్నారు. నిమ్జ్ ప్రాజెక్టులో పరిశ్రమల ఏర్పాటు పనులు ఎప్పుడు జరుగుతాయని జహీరాబాద్ ప్రాంత ప్రజలు, నిరుద్యోగులు ఎప్పుడెప్పుడు వస్తాయని ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. నిమ్జ్ ప్రాజెక్టులో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలు, యాజమాన్యాలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించి పనులను వేగవంతంగా చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జహీరాబాద్ పట్టణంలోని బాలికల ఉర్దూ మీడియం జూనియర్ కళాశాలలో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఫలితంగా విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకొని కళాశాలలో అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సేంద్రియ వ్యవసాయ పద్ధతులతోనే అధిక దిగుబడి

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, సిబ్బంది

జహీరాబాద్, మార్చి 27 : ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంతోనే పంటల దిగుబడిని సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ అన్నారు. గురువారం జహీరాబాద్ మండలంలోని దిడ్గి గ్రామ శివారులోని డీడీఎస్-కేవీకే కేంద్రంలో రైతులకు శిక్షణ, వ్యవసాయ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడులు, నాణ్యమైన విత్తనాల వినియోగం, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులతో పంటల దిగుబడిని సాధించవచ్చన్నారు. సేంద్రియ వ్యవసాయంలో భూమిని కాపాడుకోవడమే కాకుండా చీడపురుగుల నివారణతో అదాయాన్ని పెంచుకోవచ్చన్నా రు. డీడీఎస్-కేవీకే కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వహణ అధికారి రామచారి, డీడీఎస్-కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న రైతులకు వ్యవసాయ పనిముట్లు, పరికరాలను అందజేశారు. డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు శైలజ, రమేశ్, స్నేహలత, హేమలత, సాయిప్రియాంక, కైలాశ్, ఏడీఏ బిక్షపతి, ఏవో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శనతో నిరసన

51వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు



గుమ్మడిదలలో నిరాహారదీక్షలో పాల్గొన్న టెంట్‌హౌస్ టీమ్‌కు సంఘీభావం తెలుపుతున్న జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మార్చి 27 : ఎంఎస్‌డబ్ల్యూ (డంపింగ్‌యార్డు) అనుమతులు వెంటనే రద్దు చేయాలని బాధిత గ్రామాల ప్రజలు కాగడాలతో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను రద్దు చేయాలని నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామస్తులు కాగడాలతో గ్రామంలో ప్రదర్శన చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నిరసన వ్యక్తం చేశారు. గురువారం గుమ్మడిదలలో టెంట్‌హౌస్ ఫ్రెండ్స్, నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో జేఏసీ నాయకులు 51వ రోజు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో డంపింగ్‌యార్డును రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు చేపట్టిన నిరసన దీక్షకు నల్లవల్లి జేఏసీ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో డంపింగ్‌యార్డును రద్దు చేయాలని అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కరాములు పాల్గొన్నారు.

'ఖేడ్' బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భోజిరెడ్డి

నూతన అధ్యక్షుడు భోజిరెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

నారాయణఖేడ్, మార్చి 27 : నారాయణఖేడ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది భోజిరెడ్డి ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్ రావు, కార్యదర్శిగా నర్సింహారావు, సహాయ కార్యదర్శిగా సంగమేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా సాయిలు, కమిటీ సభ్యులుగా నర్సారెడ్డి, ఆనంద్ స్వరూప్ శెట్కార్, లక్ష్మణ్‌రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు న్యాయవాదులు నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో దీక్ష



దీక్షలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 27: ప్రభుత్వ, పేదల భూములు కబ్జా చేసిన రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యంపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. తమ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకునేందుకు వెళ్లిన పేదలను, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు జిల్లా నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రామోజీ ఫిల్మ్ సిటీ దగ్గర నాగన్‌పల్లి, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 700 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున 2007లో ప్రభుత్వం పట్టాలిచ్చిందని గుర్తు చేశారు. ఆ స్థలాల్లోకి వెళ్లిన 75 మంది పేదలపై గతంలో అక్రమ కేసులు పెట్టి ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిప్పిందన్నారు. సమస్యను పరిష్కరించకుండా ఇందులో ప్రభుత్వం జాప్యం చేస్తుందని, రామోజీ ఫిల్మ్ సిటీ వారికే అనుకూలంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన రామోజీ ఫిల్మ్ సిటీ సంస్థపై వెంటనే కేసులు నమోదు చేసి, పేద ప్రజలకు ఇండ్ల స్థలాలను అప్పగించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మాణిక్యం, సాయిలు, నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

సెర్ఫ్ లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు

వీడియోకాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్

వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, వివిధ శాఖల అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 27 : సెర్ప్ లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ అన్నారు. గురువారం సెర్ప్ సీఈవో దివ్య జ్యోతితో కలిసి హైదరాబాద్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ కుమార్ మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్‌లో సెర్ప్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకేపీ కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని సీఎం నిర్ణయించారని వెల్లడించారు. ప్రస్తుతం 33 శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఇతర శాఖల ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు చేయలేని పక్షంలో ఆ కేంద్రాలను ఐకేపీలో బదిలీ చేయాలని సూచించారు. అదనపు ధాన్యం దిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటు సైతం స్వశక్తి మహిళా సంఘాలతో ప్రారంభించాలని కలెక్టర్‌కు తెలిపారు. దివ్యాంగులకు యూడీఐడీ కార్డుల జారీ, వృద్ధాప్య పింఛన్లు, మహిళా శక్తి సంఘాలతో నిర్వహిస్తున్న టైలరింగ్ ప్రక్రియ, పెట్రోల్ బంకులు, ఇందిరా మహిళా శక్తి బజార్ కింద దుకాణాల ఏర్పాటు, మహిళా సంఘాల సభ్యులకు ప్రమాదబీమా,తదితర అంశాలపై కలెక్టర్‌కు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి, డీఈవో వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్, డీఆర్డీవో జ్యోతి, అదనపు డీఆర్డీవో జంగారెడ్డి పాల్గొన్నారు.

భారతీనగర్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

భారతీనగర్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, మార్చి 27 : భారతీనగర్ డివిజన్‌లోని బొంబాయికాలనీ, ఎల్ఐజీ, మ్యాక్‌సొసైటీ ఏరియాలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పర్యటించారు. స్థానికంగా ఉన్న పలు సమస్యలను కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. బొంబాయికాలనీలో నిర్మాణంలో ఉన్న మోడల్ రైతుబజార్ పనులను ఆయన పరిశీలించారు. పార్కింగ్ వాల్‌కి గ్రీ ల్స్‌ని ఏర్పాటు చేయించాలని కార్పొరేటర్ కోరారు. ఎల్ఐజీ నుంచి అంబేద్కర్ విగ్ర హం వరకు రోడ్డు పనులకు నిధులు మంజూ రు చేయాలన్నారు. మ్యాక్‌సొసైటీ కాలనీకి వెళ్లే మార్గంలో భెల్‌కి చెందిన ఖాళీ స్థలంలో చెత్తను డంప్ చేయడంతో తీవ్రదుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో స్పెషల్ డ్రైవ్ కింద శుభ్రం చేయించినా ఫలితం లేదని చైన్‌లింక్ మెష్‌ని ఏర్పాటు చేయించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అక్కడే ఉన్న భెల్ అధికారులతో జెడ్సీ మాట్లాడుతూ ఫెన్సింగ్‌తో పాటు గ్రీనరీ ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. అనంతరం డివిజన్‌లో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల గురించి ఆయన కార్పొరేటర్‌ని అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఉపకమిషనర్ సురేశ్, ఈఈ సురేశ్, డీఈ నరేందర్, ఏఈ దివ్యతేజ, నాయకులు పాపయ్యయాదవ్, యాదగిరిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఐలేశ్, కుత్బుద్దీన్, మహేశ్ గౌడ్, గౌస్, బూన్ తదితరులు ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులు పరిష్కరించాలి

మిర్జాపూర్(బి)లో కాలిపోయిన బోరును పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజశేఖర్

జహీరాబాద్, మార్చి 27 : ఒకవైపు అసలే ఎండకాలం.. మరోవైపు రంజాన్, ఉగాది పండుగలు.. తాగునీటి బోరు కాలిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. సంబంధిత గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని న్యాల్‌కల్ మండలం మిర్జాపూర్(బి) గ్రామ ప్రజలు అగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక గ్రామంలోని 10వ వార్డులో నాలుగైదు రోజుల కింద తాగునీటి సరఫరా చేసే బోరు కాలిపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులకు బోరును బాగు చేయాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీకి నిధుల కొరత ఉందనే సాకుతో గ్రామ పంచాయతీ కార్యదర్శి బోరుకు మరమ్మతులు చేయించడం లేదన్నారు. గురువారం స్థానిక గ్రామ నాయకులు, కాలనీవాసులు తాగునీటి ఇబ్బందులను మండల అభివృద్ధి అధికారి రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే గ్రామానికి చేరుకుని కాలిపోయిన బోరును పరిశీలించారు. బోరును బాగు చేయించి తాగునీటి ఇబ్బందులను తొలగిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

మైనార్టీల ఆశీస్సులు ఉండాలి

బీఆర్‌ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి

ప్రార్థనలు చేస్తున్న బీఆర్‌ఎస్‌నేత ఆదర్శ్‌రెడ్డి, ముస్లింలు

రామచంద్రాపురం,మార్చి 27: మైనార్టీల ఆశీస్సులు బీఆర్‌ఎస్ పార్టీపైన ఉండాలని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్సీపురం డివిజన్‌లోని ఈద్గాలో ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఇఫ్తార్ విందుని ప్రారంభించారు. కాంగ్రెస్ పాలనలో ముస్లింలకు రంజాన్ తోఫాలు లేవు, ప్రభుత్వం మైనార్టీలకు కనీస ప్రాధాన్యత కూడా ఇవ్వడంలేదని విమర్శించారు. మైనార్టీలందరూ బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించాలని ఆయన కోరారు. నేతలు అంజయ్య, రాజేశ్వర్‌రెడ్డి, సోమిరెడ్డి, బాల్‌రెడ్డి, కుమార్ గౌడ్, అవినాశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పరమేశ్, నర్సింహ, జగన్నాథ్‌రెడ్డి, జమీల్, అజీ ముద్దీన్, గఫర్, కుత్బుద్దీన్, వెంకట్‌రెడ్డి, కృష్ణకాంత్, మహేశ్‌గౌడ్, క్రాంతి, బూన్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 27 : నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్ గ్రామానికి చెందిన కృష్ణవేణి, నాగారం అంబయ్యలకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను గురువారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి వారికి అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించని పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స పొందిన నిరుపేదలను ఆదుకునే దిశగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల సహకారంతో సీఎం సహాయనిధి చెక్కులను మంజూరు చేయించి అందజేస్తున్నట్లు భూపాల్‌రెడ్డి తెలిపారు. తనకు పదవి ముఖ్యం కాదని నియోజకవర్గ ప్రజలకు సేవలందించడమే ముఖ్యమని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.

హత్నూరలో..

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అజ్మత్ అలీ

హత్నూర, మార్చి 27 : హత్నూర మం డలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన బొల్లా రం లక్ష్మీ నర్సమ్మకు మంజూరైన రూ.45 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అజ్మత్ అలీ అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు కిషన్ గౌడ్, యాదయ్య, నందు, నవీన్, ప్రశాం త్, పవన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాల్లో వీరభద్రస్వామివారికి పూజలు చేసిన ధర్మకర్తలు

గుమ్మడిదల, మార్చి 27: జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామివారి ఏకాంత సేవలో ముగింపు పలికారు. ఆలయకమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య, ధర్మకర్తలు, అర్చకస్వాములు ఆధ్వర్యంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సప్తస్వరాల మధ్య ఏకాంత సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వతనుదారులు ఆలేటి జగన్‌మోహన్‌రెడ్డి, ముక్కా వెంకన్న, రోహిత్‌రెడ్డి, గటాటి రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలి

ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతి చక్రం అవార్డులను అందజేస్తున్న డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్

జహీరాబాద్, మార్చి 27 : ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ డిపో పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు సంబంధిత అధికారులను కో రారు. గురువారం జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు, ప్రజలు ఫోన్‌లో మాట్లాడుతూ జహీరాబాద్-బీదర్ మార్గంలో షటిల్ బస్సులను నడిపించాలన్నారు. నారాయణఖేడ్-జహీరాబాద్ మార్గంలో సాయంత్రం పూట బస్సులను నడిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జహీరాబాద్-చించోళి బస్సులను నడించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రజలు, ప్రయాణికుల నుంచి వచ్చిన విన్నపాలు, ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని ప్రయాణికులు, ప్రజలను కోరారు. అనంతరం డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతి చక్రం అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో డిపో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నారాయణఖేడ్ : మాజీ సర్పంచ్‌లను ఖేడ్ పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

హత్నూర : బీఆర్‌ఎస్ మాజీసర్పంచ్‌లును అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

మాజీ సర్పంచ్‌లు .. ముందస్తు అరెస్టు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీఆర్‌ఎస్ మాజీసర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అభివృద్ధి పనులకు ఖర్చుచేసిన బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.

-సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, మార్చి 27

జహీరాబాద్ : బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న హద్నూర్ పోలీసులు

ఓటీఎస్ పథకానికి బకాయిదారుల స్పందన

జిన్నారం, మార్చి 27 : ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం కింద ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ రాయితీ మాఫీ అవకాశాన్ని కల్పించడంతో బకాయిదారులు స్పందించారు. గురువారం పారిశ్రామికవాడలోని రాసన్ పరిశ్రమ యజమాని రవీందర్ రెడ్డి రూ. 30.77 లక్షల ఆస్తి పన్ను బకాయిలు ఉండగా పథకం వర్తింపుతో పరిశ్రమకు రూ.15.58 లక్షలు మాఫీ కావడం, మిగతా పన్ను మున్సిపల్ అధికారులకు చెక్కు రూపంలో అందజేశారు. ఓటీఎస్ పథకాన్ని బకాయి దారులు సద్వినియోగం చేసుకొని మార్చి 31 లోగా పన్నులు చెల్లించాలన్నారు. మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ స్వామి, ఆర్వో నర్సింహులు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి

మునిపల్లి, మార్చి 27 : తల్లిదండ్రులను వదిలి హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్న ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక దృష్టి పెడుతూ తల్లిదండ్రుల కలలను నేరవేర్చే విధంగా ముందు కు సాగాలని మునిపల్లి ఎస్సై రాజేశ్ నాయక్ సూచించారు. గురువారం మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యాసనాలకు అలవాటు పడకుండా ఉన్నత చదువుల వైపు సాగాలన్నారు.

హుండీ లెక్కింపు

కోహీర్, మార్చి 27 : మండలంలోని బడంపేట రాచన్నస్వామి దేవాలయ హుండీని ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సూపరింటెండెంట్ శివరాజ్ సమక్షంలో గురువారం లెక్కించారు. పలు ప్రాంతాల భక్తులు స్వామివారికి సమర్పించిన నగదును లెక్కించగా రూ.3.41లక్షల ఆదాయం దేవాలయానికి సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప వెల్లడించారు. అంతకుముందు ఆలయ గర్భగుడిలోని శివలింగానికి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. జగదీశ్వర్‌స్వామి, శివానంద్, శివకుమార్, శ్రీపాల్, దయానంద్, రాజన్న, గోపాల్, సుధాకర్, రాచన్న, చెన్నవీరయ్యస్వామి, భుజంగం, విశ్వనాథ్, తదితరులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

పరామర్శ

మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు గటాటి భద్రప్ప

గుమ్మడిదల, మార్చి 27 : నర్సాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిమ్ముల మదన్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నాయకుడు గటాటి భద్రప్ప పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యేకు ఇటీవల హార్ట్ సర్జరీ కావడంతో ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈవిషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు,బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ గటాటి భద్రప్ప గురువారం పరామర్శించారు.

విద్యుత్ దీపాలకు స్విచ్ బోర్డు ఏర్పాటు

జహీరాబాద్, మార్చి 27 : జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిరానికి వెళ్లే కూడలిలోని ఐమ్యాస్ట్ విద్యుత్ దీపాలకు స్విచ్ ఆఫ్ బోర్డును ఏర్పాటు చేశారు. బుధవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలలో ప్రచురితమైన 'పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు' అనే వార్తకు స్థానిక పట్టణ మున్సిపాల్ అధికారులు స్పందించారు. స్విచ్ ఆఫ్ బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు 'నమస్తే తెలంగాణ' దినపత్రికు పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

తైబజార్ వేలం పాట

హత్నూర, మార్చి 27 : హత్నూర మండలం మేజర్ గ్రామపంచాయతీ దౌల్తాబాద్‌కు గురువారం తైబజార్ వేలం పాటను అధికారులు నిర్వహించారు. తైబజార్ వేలం పాటలో పలువురు పాల్గొనగా, గ్రామానికి చెందిన చింతప్రవీణ్ కుమార్ అత్యధికంగా రూ.10.63 లక్షలు పలికి తైబజార్ హక్కులు పొందారు. ప్రత్యేక అధికారి, ఎంపీడీవో శంకర్, ఎంపీవో యూసూఫ్, గ్రామ కార్యదర్శి మజార్ అలీ పాల్గొన్నారు.

రూ.1.05 కోట్లకు దక్కించుకున్న తైబజార్

పటాన్ చెరు, మార్చి 27 : ఇస్నాపూర్ మున్సిపల్ తై బజార్ వేలంపాటను గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. పాతూరి శ్రీనివాస్ రెడ్డి రూ.1.05 కోట్లకు దక్కించుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ సాయి మాధురి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో..

అమీన్‌పూర్ మార్చి 27 : మున్సిపాలిటీ పరిధిలోని 9 మార్కెట్లు, బీరంగూడ పరిధిలోని 6 మార్కెట్లకు వేలంపాట నిర్వహించామని మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో తైబజార్ వేలం పాట నిర్వహించారు. అమీన్‌పూర్ మార్కెట్లను మహేశ్ రూ.18.27 లక్షలకు దక్కించుకున్నారని, గతంలో రూ.16.60 లక్షలకు దక్కించుకున్నారని తెలిపారు. బీరంగూడ పరిధిలోని మార్కెట్లను గతంలో రూ.31.58 లక్షలకు దక్కించుకున్న చంద్రమోహన్‌రెడ్డి ఈసారి రూ. 38.01లక్షలకు దక్కించుకున్నారని తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం.. బాలుడి మృతి

జిన్నారం, మార్చి 27 : ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగా ఓ బాలుడు మృతి చెందిన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదారంలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మాదారం గ్రామానికి చెందిన గంగారం వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సందీప్ (12)ను ట్రాక్టర్ ఇంజన్, ట్యాంకర్‌కి మధ్యలో ఎక్కించుకున్నాడు. అతివేగం, అజాగ్రత్తగా ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో బాలుడి పైనుంచి ట్యాంకర్ చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్ గంగారంపై కేసు నమోదు చేసి, బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్ చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాలుడి మృతితో మాదారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

అందోల్, మార్చి 27: వట్‌పల్లి మండలం ఖాదీరాబాద్‌లో ఈ నెల 11న జరిగిన హత్యకేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిట్లు జోగిపేట సీఐ అనిల్ కుమార్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో హత్యకేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఖాదీరాబాద్‌కు చెందిన కొట్టె గౌరమ్మ(40) భర్త మృతిచెందడంతో ఒంటరిగా ఉంటుంది. అదే గ్రామానికి చెందిన ప్లంబర్ పనిచేసే బుస్సారెడ్డిపల్లి కిషన్ మద్యం మత్తులో 11న రాత్రి మృతురాలి ఇంటికి వెళ్లి ఆమెపై లైంగిక దాడిచేసి ఈ విషయం తెల్లారి పంచాయతీ పెడుతుందని భయంతో గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం సాక్ష్యాలను కాల్చివేసి బంగారు నగలతో పరారయ్యాడు. మృతురాలి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, కిషన్ హత్యచేసినట్లు తేలడంతో అతడి ఆచూకీ కోసం గాలించి గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.